క్లుప్తంగా

74వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులను కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దయాల్ నగర్ క్వారీ రోడ్డు నూకాంబిక ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అనపర్తి త్రినాథ్, సీకు రమణ, మండల గోవింద, కోరాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీలోని కొండవాలు ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ వార్డులోని సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. వీధి లైట్లు, మంచినీటి వసతులు కల్పించామని, దాదాపు నీటి కొరత లేకుండా చేశామన్నారు. కార్యక్రమంలో జేసీఎస్-2 కన్వీనర్ ఇల్లపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఫాగింగ్



72వ వార్డులో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

గాజువాక : దోమల నివారణా చర్యల్లో భాగంగా జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది గాజువాకలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం ఫాగింగ్ స్ప్రేయింగ్‌ను విస్తృతంగా చేపట్టారు. 72, 73 వార్డుల్లోని పలు నివాస ప్రాంతాల్లో ఫాగింగ్ యంత్రం ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు కాలనీల్లో నీటి నిల్వలను, లార్వాను గుర్తించి, వాటిని తొలగించారు. కాలువల్లో ఆయిల్ బాల్స్ వదిలిపెట్టారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వై.తాతారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్ట్ కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీకి చెందిన 28 మంది కార్మికులను పర్మినెంట్ చేయకపోవడంతో వారు బుధవారం జిల్లా కోర్టును ఆశ్రయించారు. వివరాలివి.. విశాఖ డెయిరీలో 1983 నుంచి 68 మంది కాంట్రాక్ట్ లేబర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 1992లో 40 మందిని మాత్రమే పర్మినెంట్ చేసి, 28 మందిని చేయలేదని విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వరదాడ వెంకటరమణ తెలిపారు. దీనిపై డెయిరీ యాజమాన్యానికి పలుమార్లు వినతిపత్రాలు అందజేస్తున్నా పట్టించుకోకపోవడంతో ట్రిబ్యునల్‌ను ఆశ్రయించామన్నారు. ట్రిబ్యునల్ కోర్టు 2017లో వీరికి న్యాయం చేయాలని తీర్పు వెల్లడించినా డెయిరీ యాజమాన్యం కోర్టు ఆదేశాలను పట్టించుకోలేదన్నారు. దీనిపై లేబర్ అధికారులను ఆశ్రయించగా, వారి సూచనల మేరకు ఈ ఏడాది జూన్‌లో జిల్లా కోర్టును ఆశ్రయించారన్నారు. కేసులో భాగంగా బుధవారం జిల్లా కోర్టుకు హాజరయ్యామని తెలియజేశారు.

మంగళకారిణి.. సౌభాగ్యప్రదాయిని



అన్నపూర్ణాదేవి అలంకరణలో మహాదుర్గకు పసుపుకొమ్ముల పూజ



సంతానలక్ష్మి అలంకరణలో శ్రీమహాలక్ష్మి



హంసవాహినిగా శ్రీమహాసరస్వతి



మహాలక్ష్మి అలంకరణలో దుర్గాలమ్మ



శాకాంబరి అలంకరణలో పోలమాంబ



గజలక్ష్మి అలంకరణలో కన్యకా పరమేశ్వరి

- శ్రీ మహాదుర్గకు పసుపు కొమ్ములతో అర్చన
- మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గాలమ్మ
- కనులపండువగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ఉక్కునగరం: శరన్నవరాత్రి మహోత్సవాల వేళ అమ్మవారి ఆలయాలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. ప్రత్యేక అలంకరణల్లో అమ్మవారు దర్శనమిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని త్రిశక్తి ఆలయంలో శ్రీ మహాదుర్గ అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి, సహస్ర హరిద్ర ఖండార్చన (వెయ్యి పసుపుకొమ్ములతో పూజ) చేశారు. అమ్మవార్లకు వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఫణి శర్మ నేతృత్వంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, యాగ దీక్షాధారణ, నవచండీ మండపారాధన, కలశ స్థాపన, చండీ పారాయణ నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నవరసాభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం మహాగణపతి నవగ్రహ సహిత నక్షత్ర హోమం, నవ చండీ హోమం చేశారు. శ్రీమహాదుర్గ అమ్మవారు లేత పసుపు వర్ణం చీరలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారిని పసుపు వర్ణం చీరలో సంతానలక్ష్మిగా అలంకరించగా.. శ్రీమహాసరస్వతి అమ్మవారు తెలుపు వర్ణం చీరలో హంసవాహినిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహాలక్ష్మిగా దుర్గాలమ్మ

అగనంపూడి: స్థానిక దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.55,600 నగదుతో అలంకరించారు. అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి సభ్యులు లలిత, విష్ణు సహస్ర పారాయణం చేశారు. అనంతరం ఆలయ కమిటీ లక్కీడిప్ నిర్వహించి, విజేతలకు అమ్మవారి చీరలు బహూకరించింది. బొర్రమాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది.

శాకాంబరిగా పోలమాంబ

అక్కిరెడ్డిపాలెం: ఎస్టీబీఎల్‌లోని ఎల్ఎస్ గార్డెన్స్‌లో దసరా పండగ మహోత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా పోలమాంబ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. కాయగూరలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి

గాజువాక : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతగాజువాకలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మహాలక్ష్మి దేవిగా కనకదుర్గ అమ్మవారు

మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ

70వ వార్డు ఎల్‌వీ నగర్ కనకదుర్గ ఆలయంలో దేవీ నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కనక దుర్గ అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి విశేష పూజలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

74వ వార్డులో నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్ నగర్-3 సచివాలయ పరిధిలో పాత పోలీసు క్వార్టర్స్ ఎదురుగా గురువారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు సంబంధించి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వార్డులో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చినగంట్యాడలో అన్నదానం

గాజువాక : దేవీ నవరాత్రుల్లో భాగంగా చినగంట్యాడ నాయుడోరు వీధిలో బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు రూ.5వేలు విరాళంగా అందజేశారు. సుమారు ఐదు వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పృథ్వి, దిలీప్, నాగేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

అక్కిరెడ్డిపాలెం: బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల వినాయక స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. జూలై 26 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు 80 రోజులకు రూ.1,06,046 ఆదాయం వచ్చినట్లు ఆలయ పరిపాలనా అధికారి ఎ.జగన్నాధరావు తెలిపారు. దేవదాయశాఖ పర్యవేక్షకుడు పి.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపు ప్రక్రియలో ఆలయ పాలక మండలి చైర్మన్ గంధ్రెడ్డి రామునాయుడు, సభ్యులు పెట్లి అప్పారావు, శాంతి కుమారి, బొడ్డేడ అచ్చిలినాయుడు, ఎక్స్ అఫీషియో మెంబర్ నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు

రాజధానిగా విశాఖ రూపురేఖలు మారనున్నాయి

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దామా సుబ్బారావు

కూర్మన్నపాలెం : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పరిపాలన రాజధానిగా విశాఖ నగర రూపురేఖలు మారనున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు అన్నారు. కూర్మన్నపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముందుగా తనపై నమ్మకంతో పార్టీ జిల్లా ఉపాధ్యక్ష పదవి ఇచ్చినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డికి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పర్యవేక్షణలో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. 86వ వార్డులో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై స్పందిస్తూ ప్రస్తుత కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావుకు వైఎస్సార్‌సీపీతో ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీతో సన్నిహితంగా కొన్నాళ్లపాటు ఉన్న మాట వాస్తవమని, పార్టీకి చెడ్డ పేరు వచ్చేలా ఆయన ప్రవర్తిస్తుండడంతో జిల్లా నాయకత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. పార్టీ క్యాడర్ కూడా అతడిని పార్టీ కార్యక్రమాలకు దూరం పెడుతుందన్నారు. కూర్మన్నపాలెం ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా మారుస్తానని, వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీని అందించే విధంగా కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో మెడికల్ బాబు, చేగొండి శ్రీనివాస్, వాడపల్లి రామచంద్రరాజు,మాటూరి శ్రీనివాసరావు, సాయివర్మ, పట్నాయక్, యోహాన్, బాల, నిర్మల, , పత్తిపాటి శ్రీనివాస్, ప్రసాద్, మూర్తి, మండా మోహన్, పెంటారావు, రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, నజీర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల బ్రోచర్ ఆవిష్కరణ



వేడుకల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం స్వామి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ తెలంగాణా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీజీఎం (వర్క్స్) ఎన్.వి.స్వామి మాట్లాడుతూ ఉక్కునగరంలో ఏటా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 22న సీ భవన్‌లో సాయంత్రం 6 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎన్.నర్సింగరావు, జి.మల్లేశం, రవికుమార్, ఎస్.వీరేశం, బి.గణేష్, ఎం.వేణుగోపాల్, బి.వీరయ్య పాల్గొన్నారు.

సెయిల్‌తో సమానంగా బోనస్ చెల్లించాలి



బీసీ గేట్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మహాధర్నా నిర్వహించారు. బుధవారం ఉదయం ఉక్కు బీసీ గేటుకు ఇరువైపులా కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ సెయిల్‌తో సమానంగా బోనస్ చెల్లించాలని అలాగే గతేడాది ఇవ్వకుండా నిలిపివేసిన రూ.9500 ఈ బోనస్‌లో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, నక్క వెంకటరమణ, అండిబోయిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన

ఉక్కునగరం: సెయిల్ కార్మికుల వలే విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఉక్కుకార్మికుల బోనస్ అంశంపై బుధవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద యూనియన్ మిత్రపక్షాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ బోనస్ దసరా లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీఎఫ్-3లో ఉత్పత్తి పునరుద్ధరించాలని, పాత పద్ధతిలో కార్మికులకు ఇన్సెంటివ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బి.ఎస్.రాజు, కొవిరి అవతారం, ఎస్.ఎ.నాయుడు, బీఎంకె నాయక్, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని యువకుడి దుర్మరణం



కుంచారావు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్ : మండలంలోని అల్లినగరం సమీపంలో సర్వీసు రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకి కుంచారావు (25) అనే యువకుడు మృతి చెందాడు. విశాఖపట్నం వైపు బైక్‌పై వెళుతున్న ఈ యువకుడు లారీని ఢీకొట్టాడు. టైరు కింద పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం పెదగంట్యాడ. శ్రీకాకుళం ఎందుకు వచ్చాడనే విషయం తెలియలేదు. పర్సులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ మార్చురీకి తరలించారు. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లకు నేటితో గడువు పూర్తి

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు గురువారంతో గడువు ముగుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ధ్రువ పత్రాలతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ప్రైవేటీకరణ ఆపేవరకూ ఉక్కు పోరాటం



979వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమిస్తున్నట్లుగా పార్లమెంట్‌లో ప్రకటించే వరకు ఉక్కు పోరాటం ఆగదని పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 979వ రోజు, బుధవారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ప్లాంట్‌ను నష్టాల్లో నడుపుతున్నారని ఆరోపించారు. ప్లాంట్ కష్టాల్లో ఉన్నప్పుడు కార్మిక వర్గం ఎంతో శ్రమించి ప్లాంట్‌ను దేశంలోనే నెంబర్ వన్ పరిశ్రమగా నిలిపారన్న సంగతి ప్రస్తుత యాజమాన్యం గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- 'జగనన్న ఆరోగ్య సురక్ష' తో ప్రజల ముంగిట వైద్యసేవలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- నెల్లిముక్కు, కణితి, దువ్వాడల్లో శిబిరాలకు విశేష స్పందన



నెల్లిముక్కు పీహెచ్‌సీ వద్ద శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది



దువ్వాడ-1 శిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



రోగిని పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత



రోగిని పరీక్షించి మందులు రాస్తున్న డాక్టర్ సంతోషి రూప



కణితి పీహెచ్‌సీలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జగనన్న ఆరోగ్య సురక్ష..పేదలకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు గొడ్డువానిపాలెం సచివాలయ పరిధి నెల్లిముక్కు పీహెచ్‌సీ వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. డబ్బుల్లేని కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకుడదని ఇంటింటికీ వైద్య సిబ్బందిని పంపించి, వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే అమలు చేశారన్నారు, నెల్లిముక్కు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధి 15 సచివాలయాలకు సంబంధించి 15 రోజుల పాటు ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

295 మందికి వైద్యసేవలు

శిబిరానికి హాజరైన 295 మందికి 5గురు వైద్యులు సేవలు అందించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారులు కె.రమేష్ బాబు, పి.హేమలత, గైనకాలజిస్ట్ మానస, జనరల్ ఫిజీషియన్ సంతోషి రూప, నేత్ర వైద్యుడు సయ్యద్ అజ్మాల్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రోగులు రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోన్-6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం, డాక్టర్ జీవన్‌రాణి, క్లస్టర్ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు, రాజాన వెంకటరావు, బొడ్డ గోవింద్, వార్డు ఇన్‌చార్జి గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, తనకాల సత్యనారాయణ, అండిబోయిన అప్పారావు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ సెక్టార్-1లో..

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యాల్లో ఒకటైన ప్రజలందరికీ ఆరోగ్యంలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 88వ వార్డు దువ్వాడ సెక్టార్-1లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. పేదల సంపూర్ణ ఆరోగ్యం బాధ్యతను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మహాయజ్ఞంలా చేపట్టిన కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం అవుతోందన్నారు. శిబిరంలో వైద్యులు 188 మందికి వైద్య సేవలు అందించారు. వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్ పుష్పలత, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, సీనియర్ నాయకుడు దాడి నూకరాజు, కన్వీనర్లు లాలం శ్రీను, శనివాడ రాము, ప్రమీలారావు, బత్తిన అప్పారావు, పత్తి వెంకటలక్ష్మి, సన్యాసిరావు పాల్గొన్నారు.

కణితి పీహెచ్‌సీలో 280 మందికి సేవలు

కూర్మన్నపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 87వ వార్డులోని కణితి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కొనసాగుతోంది. వడ్లపూడి-1 ప్రజల సౌకర్యార్థం జెడ్పీ సింహాచలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి బుధవారం పరిశీలించారు. శిబిరంలో సుమారు 280 మంది ప్రజలు వైద్య సేవలను పొందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కిరణ్ కుమార్, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, బొడ్డ గోవింద్, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.